క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దౌల్తాబాద్: సురాయిపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, ట్రీ కటింగ్ కారణంగా ఫీడర్ పరిధి గ్రామాలకు శుక్రవారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఏఈ మహిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బుద్ధుడి జీవితం ప్రపంచానికి ఆదర్శం



వేడుకల్లో సీఎం రేవంత్, ఎమ్మెల్యే టీఆర్‌ఆర్

పరిగి: బుద్ధుడి జీవితం ప్రపంచానికి ఆదర్శమని, ఆయన చూపిన మార్గాన్ని ప్రపంచం మొత్తం అనుసరిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం సికింద్రాబాద్‌లో నిర్వహించిన బుద్ధ పూర్ణిమ వేడుకల్లో సీఎంతో పాటు ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం ఎమ్మెల్యేతో జిల్లా అభివృద్ధిపై ఆరా తీశారు. ప్రజలకు అందుబాటులో ఉండి, సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

పార్టీ అభ్యున్నతికి కృషి



తిరుపతిరెడ్డిని కలిసిన మండల నాయకులు

యాలాల: పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ బీసీసెల్ మండల అధ్యక్షుడు అమృతప్ప అన్నారు. గురువారం పార్టీ కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షుడు తిరుపతిరెడ్డిని మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో నిలిచిన అభివృద్ధిని ఇప్పుడు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు హన్మంతు, వెంకటయ్య, లక్ష్మీనారాయణ, మొగులప్ప తదితరులు ఉన్నారు.

తేమ పేరుతో ఇబ్బంది పెట్టొద్దు



పెద్ద నందిగామలో ధాన్యం కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

కొడంగల్: రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలు చేయాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ నిర్వాహకులను ఆదేశించారు. గురువారం మండల పరిధి పర్సాపూర్, పెద్ద నందిగామ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని సూచించారు. పలు గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.

విద్యాభివృద్ధికి వేసవి శిబిరం



శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

కుల్కచర్ల: బాలికల విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రోత్సాహాన్ని అందించాలని బాలికల జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో మ్యాజిక్ బస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో చదువుతో పాటు, క్రీడల్లో ఆసక్తి పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజా కార్యక్రమంలో భక్తులు

అనంతగిరి: మండల పరిధి కొటాలగూడెంలో జగదాంబమాత, సంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయ ప్రథమ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. తెల్లవారు జామునుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

చినుకు పడితే చీకటే

- గాలి వీస్తే గంటల కొద్దీ కరెంట్ కట్
- చెట్ల పొదల్లోంచే విద్యుత్ తీగలు
- పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు

నవాబుపేట: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనాలు చెట్ల పొదల్లో ఉన్న విద్యుత్ తీగలు. కొంత కాలంగా అవి అలాగే ఉన్నాయి. కానీ వాటిని ట్రాన్స్‌కో సిబ్బంది పట్టించుకోకపోవడంతో పొదలు పెరిగి, ఆ వైర్లను పూర్తిగా కమ్మేశాయి. ఫలితంగా చిన్నపాటి గాలి వీచినా, వర్షం పడినా విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

సరఫరా పునరుద్ధరణకు ఒకరోజు..

మండల పరిధి మైతాప్‌ఖాన్‌గూడ, అక్నాపూర్, ఎల్లకొండ, లింగంపల్లి, నారెగూడ, గంగ్యాడ, చిట్టిగిద్ద, పులుమామిడి తదితర గ్రామాలకు సరఫరా అయ్యే విద్యుత్ తీగలు చెట్ల పొదల్లోంచే ఉన్నాయి. దాంతో గాలి వీచిన ప్రతిసారి విద్యుత్ అంతరాయంతో పాటు, మంటలు వస్తున్నాయి. మళ్లీ కరెంటు రావాలంటే, సిబ్బంది వచ్చి వైర్లు సరి చేసి, సరఫరాను పునరుద్ధరించేందుకు ఒక రోజు సమయం పడుతుంది. ఇలా వర్షం కురిసిన ప్రతిసారి ఇలాగే జరుగుతుందని బాధిత గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. అయినప్పటికీ సమస్యను ఎవరూ పట్టించుకోవటం లేదని ఆరోపిస్తున్నారు. ఇదే అంశంపై గతంలో మండల సర్వసభ్య సమావేశంలో విద్యుత్ అధికారులను ప్రజాప్రతినిధులు నిలదీశారు. అయినప్పటికీ.. సమస్యకు పరిష్కారం లభించడం లేదు. వచ్చేది వానాకాలం అని, విద్యుత్ అధికారులు స్పందించి, చెట్ల పొదల నుంచి తీగలకు విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

త్వరగా పరిష్కరిస్తాం..

విద్యుత్ సమస్యలు పలు గ్రామాల్లో ఉన్నాయి. క్రమంగా పరిష్కరిస్తున్నాం. గాలి ఎక్కువగా వీచినప్పుడు స్తంభాలు విరిగి పడుతున్నాయి. దాని వలన మరమ్మతులకు, పొదల తొలగింపునకు ఆటంకం కలుగుతోంది. వీలైనంత త్వరగా.. విద్యుత్ తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు చర్యలు చేపడతాం.

– ప్రమోద్‌సింగ్, ఏఈ, నవాబుపేట



మాదిరెడ్డిపల్లి, మైతాప్‌ఖాన్‌గూడ మధ్యలో విద్యుత్ తీగలను అల్లుకున్న చెట్ల పొదలు

నిరుపయోగంగా గృహనిర్మాణ భవనం



వృథాగా ఉన్న భవనం

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని విద్యుత్ ఉపకేంద్రం వద్ద దశాబ్ద కాలం క్రితం నిర్మించిన గృహనిర్మాణ శాఖ భవనం నిరుపయోగంగా మారింది. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మండలానికి ఒకటి చొప్పున రూ.5 లక్షలతో గృహనిర్మాణ శాఖ అధికారుల కోసం భవనాలను నిర్మించారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు అనంతరం.. గృహనిర్మాణ శాఖను రద్దు చేయడంతో ఆ భవనం వినియోగంలో లేకుండా పోయింది. చుట్టూ పెరిగిన ముళ్లపొదలతో పాడుబడిన బంగ్లాగా మారిందని, రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన భవనం ఇలా వదిలేస్తే ఎలా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ సర్కారే కొలుదీరి ఉందని, ఈ భవనాన్ని మరేదైనా శాఖకు అప్పగించి, వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

క్రీడలతో ఆరోగ్యం

- స్నేహం కోసం టోర్నీ నిర్వహించడం అభినందనీయం
- బీజేపీ జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి



విజేత జట్టు ప్రైజ్ మనీని స్నేహితుడి కుటుంబ సభ్యులకు అందజేస్తున్న వెంకట్

చేవెళ్ల: స్నేహం కోసం టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని బీజేపీ జిల్లా కార్యదర్శి జి. వెంకట్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం చనువెళ్లి గ్రామంలో గురువారం ఎండీ నిజాముద్దీన్, ఎం. విజయ్‌కుమార్‌ల స్మారకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నీ ముగింపు కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, గ్రామ నాయకుడు శ్రీనివాస్‌చారి బహుమతుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలో యువకులంతా కలిసి గ్రామ పెద్దల సహకారంతో మృతి చెందిన స్నేహితుల జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడంతో పాటు బాధిత కుటుంబాలకు కూడా సహాయం అందజేయాలనే ఆలోచన హర్షించ దగిన విషయమన్నారు. స్నేహితుల కుటుంబాలకు సహాయం చేయడంతో పాటు ఈ క్రీడలతో యువకుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయవచ్చునని పేర్కొన్నారు. అంతేకాకుండా క్రీడలతో ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. విజేతగా కేకేఆర్ జట్టు నిలిచిందని, సీఎస్‌కే రన్నరప్‌గా నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు. విజేత జట్టు ప్రైజ్‌మని రూ.30వేల నగదును ఇదే వేదికపై స్నేహితుడు ఎండీ నిజాముద్దీన్ కుటుంబ సభ్యులకు, రన్నరప్‌గా వచ్చిన ప్రైజ్ మనీ రూ.15వేలు కూడా ఎం. విజయ్‌కుమార్ కుటుంబసభ్యులకు అందజేశారు. అనంతరం నిర్వాహకులు యు. నర్సింలు, రమేశ్, శ్రీనివాస్, విశాల్, నాగేశ్, రవివర్మలు మాట్లాడారు. టోర్నమెంట్‌కోసం గ్రామ పెద్దలు పూర్తి సహకారం అందించారన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు జి. రాజేందర్‌గౌడ్, జి. వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, భూపతిరెడ్డి ఉన్నారు.

గ్రామస్తులకు అందుబాటులో ఉండండి

కార్యదర్శులకు సూచించిన ఎంపీడీఓ

కుల్కచర్ల: జీపీ కార్యదర్శులు గ్రామస్తులకు అందుబాటులో ఉండాలని, మౌలిక సదుపాయాల కల్పనలో ఎటువంటి సమస్యలు తలెత్తినా తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూసుకోవడంతో పాటు వానాకాలం నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మురుగుకాల్వల్లో నీరు నిలవకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ ఖరీం, ఏపీఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

ఆదమరిస్తే.. అంతే సంగతులు



గుంత పక్కనుంచి వెళ్తున్న వాహనం

రహదారి పక్కనే కల్వర్టు గుంతలు

ధారూరు: గ్రామీణ ప్రాంతాల్లో పచ్చటి పొలాలు, ఏపుగా పెరిగిన చెట్ల మధ్యన ఉన్న రహదారుల్లో ప్రయాణిస్తే ఎంత ఆహ్లాదకరంగా ఉంటుందో.. దాని వెంటే ప్రమాదాలు అంతే విధంగా పొంచి ఉంటాయి. అందుకు నిదర్శనం తాండూరు–హైదరాబాద్ వయా ధారూరు, కేరెల్లి, బుగ్గా మీదుగా వెళ్లే ప్రధాన రోడ్డు. ఈ మార్గంలో పయనిస్తున్న వారికి ఎబ్బనూర్ చెరువు సమీపాన ఉన్నట్టుండి కుడి వైపునకు ఒక మలుపు రాగా.. అక్కడే రోడ్డుకు ఇరువైపులా దిమ్మెలు లేని కల్వర్టు గుంతలు ఉన్నాయి. కానీ ఇవి దగ్గరకు వెళ్తే కాని కనిపించవు. ఇది గమనించకుండా వెళ్తే ప్రమాదాలు జరగడం ఖాయం. ఏ మాత్రం ఆదమరిచినా.. ఇక అంతే సంగతులు!. ఇదే ప్రాంతంలో పలుమార్లు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్న సంఘటనలు ఉన్నాయి. అయినప్పటికీ ఆర్ అండ్ బీ అధికారులు ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. ఇదే విషయాన్ని కేరెల్లి ఎంపీటీసీ శ్రీనివాస్.. మండల సర్వసభ్య సమావేశంలో పలుమార్లు ప్రస్తావించినప్పటికీ.. సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటికైనా స్పందించి రోడ్డుకు ఇరువైపులా దిమ్మెలు నిర్మించి, సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

మంత్రికి శుభాకాంక్షల వెల్లువ

షాద్‌నగర్: రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసానికి పార్టీ నాయకులతో కలిసి వెళ్లి శాలువా కప్పి, బొకే అందజేశారు. అనంతరం షాద్‌నగర్‌లో చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తెచ్చారు. బ్రిడ్జి నిర్మాణానికి తన సహకారం అందించి, పనులు పూర్తి చేసే విధంగా చర్యలు చేపడుతామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.



మంత్రికి బొకే అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

సబ్సిడీపై విత్తనాల పంపిణీ నేడు

మండల వ్యవసాయాధికారి తులసి

చేవెళ్ల: రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు జనుము, జీలుగ పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి తులసి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 60శాతం సబ్సిడీపై జనుము, జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వీటిని శుక్రవారం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. చేవెళ్ల మండలానికి సంబంధించి రైతుల కోసం 240 క్వింటాళ్ల జనుము, 8.7క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. జనుము 40కిలోల బస్తా సబ్సిడీ పోను రూ. 1,448లు చెల్లించాలని, జీలుగ విత్తనాలకు 30కిలోల బస్తాకు రూ.1,116లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. విత్తనాలు అవసరం ఉన్న రైతులు ఆధార్‌కార్డు, పట్టాపాస్‌బుక్ జిరాక్స్‌లను తీసుకొని ఆయా గ్రామాల రైతు వేదికల వద్ద వ్యవసాయ విస్తరణ అధికారులను కలిసి పర్మిట్ రాయించుకోవాలని చెప్పారు. పర్మిట్‌లు రాయించుకున్న రైతు లు మండలంలోని ముడిమ్యాల పీఏసీఎస్ వద్ద అందుబాటులో ఉన్న ఈ విత్తనాలను తీసుకోవాలని కోరారు. మండలంలోని రైతు వేదికల వద్ద ఉద యం 9–30 గంటల నుంచి వ్యవసాయ విస్తారణ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

కొందుర్గులో..

కొందుర్గు: పచ్చిరొట్ట ఎరువుగా సాగుచేసుకోవడం కోసం రైతులకు జనుము విత్తనాలు పంపిణీ చేశారు. ఒక హెక్టారుకు 40 కిలోల చొప్పున, ఒక్కో రైతుకు రెండు బస్తాల విత్తనాలు అందించారని ఏఓ శిరీష తెలిపారు. సబ్సిడీ పోను 40 కిలోల బస్తాకు రూ.1450లకు విక్రయించినట్లు చెప్పారు. పచ్చిరొట్ట ఎరువు విత్తనాల కోసం ఆగ్రోస్ సెంటర్ల వద్ద ఉదయంనుంచి క్యూలైన్లో ఉన్నట్లు చెప్పారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- రైతులు అప్రమత్తంగా ఉండాలి
- ఏడీఏ లక్ష్మీకుమారి



ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

మోమిన్‌పేట: నకిలీ పత్తి విత్తనాలను విక్రయించే వారి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏడీఏ లక్ష్మీకుమారి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో ఇంటర్నల్ స్క్వాడ్ బృందం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నకిలీ విత్తనాలు అంటకట్టేందుకు గ్రామాల్లో వ్యాపారులు తిరుగుతుంటారని తెలిపారు. ఆ విత్తనాలు అమ్మేవారు ఎటువంటి రసీదులు ఇవ్వరని, అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండి, అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆమె పేర్కొన్నారు. లైసెన్సు ఉన్న దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేసి, తప్పని సరిగా బిల్లు తీసుకోవాలని ఏడీఏ రైతులకు సూచించారు. విత్తనాలు కొనుగోలు చేస్తున్న ప్రతి పత్తి రైతు వివరాలను రిజిష్టర్‌లో నమోదు చేయాలని దుకాణ యజమానులను ఆమె ఆదేశించారు. అంతే కాకుండా ప్రతి రోజు స్టాకు రిజిష్టర్‌లో నమోదు చేసిన తరువాత, బోర్డుపై రాసి ఉంచాలని వెల్లడించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంటర్నల్ స్క్వాడ్ బృందం సభ్యులు, వ్యవసాయ అధికారి జయశంకర్ తదితరులు ఉన్నారు.

అవకాశవాద రాజకీయాలు తగవు

- దేశ ప్రజల అభ్యున్నతికి కృషి చేయండి: బీజేపీ శ్రేణులు
- మత పరమైన రిజర్వేషన్ల తీర్పుపై హర్షం వ్యక్తంచేసిన కమలనాథులు

కుల్కచర్ల: అవకాశవాద రాజకీయ నాయకులు ఇకనైనా బుద్ధితెచ్చుకుని, దేశ ప్రజలు లబ్ధిపొందేలా పాలనాపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రహ్లాదరావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప సూచించారు. మత పరమైన రిజర్వేషన్లు ఇవ్వడం సరైనది కాదంటూ గురువారం పశ్చిమ బెంగాల్ హైకోర్టు ఇచ్చిన తీర్పునకు స్పందిస్తూ హర్షం వ్యక్తంచేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఇతర దేశాలకు చెందిన రోహింగ్యాలకు మన ప్రాంతంలో రిజర్వేషన్లు కల్పిస్తూ, ఇక్కడి నిస్వార్థమైన మైనార్టీలకు అన్యాయం చేస్తున్న రాజకీయ పార్టీలకు న్యాయస్థానం తీర్పు చెంపపెట్టులాంటిదని అభివర్ణించారు. ఎన్నికల్లో గెలుపొందేందుకు విదేశి విచ్ఛిన్న శక్తులకు అధికారం ఇస్తే, వారు ఇక్కడి సంపదతో మన దేశాన్ని నాశనం చేస్తారని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో అధికంగా బీజేపీ అభ్యర్థులే గెలవనున్నారని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సురేష్, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య, నాయకులు కాటనిపల్లి ఆంజనేయులు, మైపాల్, జానకిరాం, శ్రీశైలం, రాంచంద్రయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండల పరిధి పెంజర్ల గ్రామంలో గురువారం అనంత పద్మనాభస్వామి ఆలయంలో నిర్వహించిన స్వామివారి కల్యాణంలో ఆయన పాల్గొన్నారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం వారిని ఆలయ కమిటీ చైర్మన్ బెజవాడ అనితారెడ్డితో పాటు పలువురు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెంజర్లలో వెలసిన అనంత పద్మనాభస్వామి ఆలయానికి విశిష్టమైన చరిత్ర ఉందన్నారు. ఇక్కడ భక్తులు కోరిన కోరికలు తప్పకుండా తీరుతాయని చెప్పారు. భక్తుల విశ్వాసంతో ఆలయం దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. స్థానికులతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు కూడాఈ ఆలయాన్ని దర్శించుకుంటున్నట్లు వివరించారు. రానున్న రోజుల్లో ఈ ఆలయానికి ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం లేకపోలేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, కొత్తూరు ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, శివశకంర్‌గౌడ్, అగ్గనూరు విశ్వం, జె. సుదర్శన్‌గౌడ్, కృష్ణ, జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చామంతి సాగు భలే బాగు



మాచన్‌పల్లిలో జర్మన్ పూలసాగు

పూల తోటలకు ఇదే మంచి సమయం

- ఆశాజనకంగా రాబడి
- ఆసక్తి చూపుతున్న రైతులు

షాబాద్: చామంతి పూలసాగుకు మంచి సమయం రానే వచ్చింది. దీంతో పూ తోటల పంటలకు రైతులు నిమగ్నమయ్యారు. పండుగలు, పెళ్లిళ్లు, పూజలకు చామంతి పూలను ఎక్కువగా ఉపయోగిస్తారు. దీంతో వాటికి అధిక డిమాండ్ ఉంటుంది. రాబడి కూడా అదే మాదిరిగానే వస్తుంది. చామంతి సాగుకు నల్లరేగడి, బరక నేలలు అనుకూలంగా ఉండడంతో వాటి సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఏటా వందలాది ఎకరాల్లో చామంతి, బంతి పూలను సాగు చేస్తున్నారు. ఎక్కువమంది రైతులు చామంతి పంటలకే ఆసక్తి కనబరుస్తున్నారు. ఒక్కోరైతు కనీసం రెండు నుంచి మూడెకరాలకు తగ్గకుండా నాలుగు రకాల చామంతి తోటలను వేస్తూ ఆదాయం గడిస్తున్నారు.

పంట కాలం

చామంతి సాగు జూన్, జూలై నెలలోనే సాగవుతుంది. సరిగ్గా ఆరు నెలలకు దిగుబడి వస్తుంది. ఆ సమయంలో కార్తీకమాసం, పండుగలు, పెళ్లిళ్లు వరుసగా వస్తుండడంతో పూలకు మంచి గిరాకీ ఉంటుందని రైతులు చెబుతున్నారు.

సాగు చేసే గ్రామాలు

షాబాద్ మండలంలోని సర్దార్‌నగర్, అంతారం, రుద్రారం, సోలిపేట్, మద్దూర్, మాచన్‌పల్లి, పోలారం, పోతుగల్, చర్లగూడ, ఎల్గోండగూడ, చందనవెల్లి, తిర్మలాపూర్, అంతిరెడ్డిగూడ తదితర గ్రామాల్లో కనీసం 50నుంచి 70ఎకరాల్లో సాగు చేస్తున్నారు. అందులో తెలుపు, క్యారెట్, మేరిగోల్డ్, పేపర్‌వైట్, పసుపు, వంగపూత, ఎగ్‌వైట్ రకాల పంటలను వేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, బెంగళూర్ తదితర రాష్ట్రాల నుంచి మొక్కలను తెచ్చుకుంటారు. ఒక్కో మొక్క రకాన్ని బట్టి రూ.1 నుంచి రూ.3 వరకు పలుకుతోంది. ఎకరా విస్తీర్ణంలో చామంతి సాగుకు రూ. 60వేల వరకు ఖర్చవుతుంది. రెండు నెలల పాటు వారంలో రెండు కోతలు దిగుబడులు వస్తాయి. పంటకాలం పూర్తయ్యేలోగా ఎకరాకు దాదాపు 8 టన్నుల వరకు దిగుబడి అందుతుందని రైతులు పేర్కొంటున్నారు. పండగల సమయంలో దాదాపు కేజీ చామంతి పూలు రకాన్ని బట్టి రూ.70 నుంచి రూ.120 వరకు ఉంటుంది.



సర్దార్‌నగర్‌లో పూల తోటను సాగు చేస్తున్న రైతులు అమృత్‌రాజు, స్వప్న

పెళ్లిళ్ల సీజన్‌లో భారీ డిమాండ్

ప్రతీ ఏడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా చామంతిని సాగు చేయాలని సిద్ధం చేసుకున్నా. వైట్, రెడ్, వంగపూత రకాలను సాగు చేస్తున్నాను. పెళ్లిళ్ల సీజన్‌లో చామంతికి మంచి డిమాండ్ ఉంటుంది. ముందు నుంచే పూల సాగుకు పొలం సిద్ధం చేసుకున్నాను.



– దాదె అమృత్‌రాజు, రైతు సర్దార్‌నగర్

రెండు ఎకరాల్లో నాలుగు రకాల పూలు

ప్రస్తుతం రెండు ఎకరాల్లో నాలుగు రకాల పూలను సాగు చేస్తున్నాను. దిగుబడి వచ్చే సమయానికి కార్తీకమాసం, పెళ్లిళ్లు, పండుగలు వస్తాయి. ఆ సమయంలో పూలకు మంచి గిరాకీ ఉంటుంది. కూరగాయలతో పాటు పూలసాగు వేస్తున్నా. దీంతో వాటికి రాబడి కూడా ఎక్కువ ఉంటుంది.



– గంగిడి భూపాల్‌రెడ్డి, రైతు, హైతాబాద్